సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

మదనపల్లె మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టపగలే అధికార పార్టీ అండదండలతో తవ్వకాలు జరుపుతున్నారు. - 8లో



దయచేసి రండి..

చాలా కాలం తర్వాత ఎంపీలతో సమావేశం కావాలన్న ఆలోచనకు దక్షిణమధ్యరైల్వే వచ్చింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న విజయవాడలో జరిగే సమావేశానికి రావాలని లేఖలు పంపింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.300
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 501 మెట్రిక్ టన్నులు





కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

నిందితులను శిక్షించాలి



కోల్‌కతా ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్య కళాశాలు, ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రికి వచ్చే బయట వ్యక్తులపై నిఘా పెట్టాలి. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే వైద్యులపై దాడులు చేయడం సరికాదు. - పద్మాంజలిదేవి, మెడికల్ సూపరింటెంటెంట్, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె.

భద్రతాచర్యలు చేపట్టాలి



వైద్యుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. పనిచేస్తున్న చోట ప్రతి మహిళా వైద్య సిబ్బందికి తాము భద్రతలో ఉన్నామన్న అభయం కలగాలి. అప్పుడే వైద్యులు భయం లేకుండా వైద్య సేవలు అందించ గలుగుతారు. - డాక్టర్ ఆరీఫుల్లా, సీహెచ్‌సీ వైద్యులు, బి.కొత్తకోట

ప్రత్యేక చట్టం అవసరం



డ్యూటీలో ఉన్న వైద్యులు, స్టాఫ్‌నర్స్, నర్స్‌ల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బందికి ప్రతి ఒక్కరూరక్షణ కవచంలా ఉండాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో మహిళా వైద్యులు, నర్స్‌లు విధులు నిర్వహించే చోట పోలీసు బీట్ ఉండేలా చూడాలి. కోల్‌కత్తా సంఘటన దోషులను తక్షణమే శిక్షించాలి. - సంగరాజు బాలరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎంఏ, రాజంపేట

భరోసా కల్పించాలి



ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే మహిళా సిబ్బందికి వందశాతం భరోసా కల్పించాలి. విధి నిర్వహణలో ఎ దురయ్యే ఇబ్బందులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి. మద్యం మత్తులో ఉండేవారు ఆసుపత్రి పరిసరాల్లోకి రాకుండా చూ డాలి. - లక్ష్మీ, హెడ్ నర్స్, దేవపట్లపీహెచ్‌సీ సంబేపల్లె మండలం

న్యూస్‌రీల్

నేడు కలెక్టర్ హార్సిలీహిల్స్ రాక

బి.కొత్తకోట : హార్సిలీహిల్స్‌పై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒబెరాయ్ హోటల్స్ కు 20 ఎకరాల భూమి కేటాయించింది. దీనిని పరిశీలించేందుకు ఒబెరాయ్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ మంగళవారం హార్సిలీహిల్స్ వస్తున్నారు. భూమి స్థితిని సమీక్షించి వివరాలు తెలుసుకుంటారు. కొన్ని రోజుల క్రితం కలెక్టర్ దీనిపై సమీక్షించారు. ఒబెరాయ్ ప్రతినిధులు వస్తుండటంతో సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ హార్సిలీహిల్స్ వచ్చారు. బి.కొత్తకోట రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు.

రేపు మైలవరానికి నీటి విడుదల

జమ్మలమడుగు : గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 16 టీఎంసీలకుపైగా నీరు నిల్వ ఉంది. ఇప్పటికే చిత్రావతి బ్యాలెన్సు రిజర్వాయర్,పైడిపాళెం ప్రాజెక్టులకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని మోటార్లద్వార పంపింగ్ చేస్తున్నారు. అదేవిధంగా ముద్దనూరు మండలం, కమలాపురంలో ఉన్న వామికొండ సర్వారాయ సాగర్ ప్రాజెక్టులకు గాలేరు-నగరి వరద కాలువల ద్వారా గండికోట వెనుక జలాలను విడుదల చేశారు. మరోరెండు రోజుల్లో గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు మైలవరం ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

కొండంత నిర్లక్ష్యం

- హార్సిలీహిల్స్‌లోమూత పడిన టూరిస్ట్ పోలీస్‌స్టేషన్
- చెత్త సేకరణ నిలిచి అధ్వానంగా పారిశుధ్యం
- హైమాస్ లైట్లు వెలగక అంధకారం
- మినరల్ వాటర్ ప్లాంట్లు మూతతో నీటి కొనుగోళ్లు



హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీసు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు (ఫైల్)

బి.కొత్తకోట : రాష్ట్రంలో ఏకైక వేసవి విడది కేంద్రం అంధ్రాఊటీగా పేరుగాంచిన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉంటుంది. అభివృద్ధి విషయంలో ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమావేశాల నిర్వహణతో పాటు అభివృద్ధిపై దృష్టి సారించింది. ప్రత్యేక చర్యలతో పాలన సాగించింది. కూటమి ప్రభుత్వం రాగానే పాలన గాడితప్పింది. సమస్యలు చుట్టుముట్టాయి.అభివృద్ధి అటకెక్కింది. దీన్ని సరిచేసేందుకు ఉన్నతాధికారులు సత్వరమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది.



హార్సిలీహిల్స్ గాలిబండ వద్ద చెత్త

హైమాస్ హుష్

గత ప్రభుత్వంలో రూ.14 లక్షల వ్యయంతో కొండపై విద్యుత్ వెలుగులు వచ్చాయి. పర్యాటకుల భద్రత కోసం గాలిబండపై రెండు, జిడ్డు సర్కిల్‌లో ఒకటి, రెవెన్యూ అతిథిగృహం వద్ద ఒకటి, ఏనుగుమల్లమ్మ ఆలయం వద్ద ఒకటి హైమాస్ లైట్లను ఏర్పాటు చేశారు. కొండకింద రోడ్డుపై వెళ్తున్న వారిని ఆకర్షించేలా వెలుగులు ఉండేవి. ఇప్పుడు జిడ్డి సర్కిల్‌లో ఒకటి మినహా మిగిలిన నాలుగు లైట్లు పూర్తిగా వెలగడం లేదు. దీంతో కొండపై అంధకారం నెలకొంది. అయినా దీనిగురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో సందర్శకులు కొండపై స్వేచ్ఛగా సంచరించలేని పరిస్థితి నెలకొంది.

లైన్ మెన్ లేక అవస్థలు

హార్సిలీ హిల్స్ పై విద్యుత్ సరఫరాపై నిత్య పర్యవేక్షణ అవసరం. అయితే ఇక్కడ పనిచేస్తున్న లైన్‌మెన్ బదిలీ కాగా ఈ పోస్టును భర్తీ చేయలేదు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కొండపై అంధకారం నెలకొంటోంది. మళ్లీ సరఫరా పునరుద్ధరణకు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనిపై అధికారులు స్పందించి పోస్టును భర్తీ చేయాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొంది.

సమావేశంతోనే పరిష్కారం


హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీకి మదనపల్లె సబ్ కలెక్టర్ చైర్మన్, డివిజన్ అధికారులు సభ్యులుగా ఉంటారు. దీనిపై కమిటీ సమావేశాలు నిర్వహించి కొండపై నెలకొన్న పరిస్థితులు, సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. తద్వారా సమస్యలు పరిష్కారం కావడంతోపాటు అభివృద్ధికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే వీలుంది. ఈ విషయమై సత్వర నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తీరుతాయి.

మినరల్ వాటర్ లేదు



పర్యాటకులకు ఐదు రూపాయలకే మినరల్ వాటర్ అందించేలా గత కలెక్టర్ గిరీషా హార్సిలీహిల్స్‌పై వాటర్‌ప్లాంటను ప్రారంభించారు. దీని నిర్వహణ బాధ్యతలను మదనపల్లె గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు అప్పగించారు. వారు దీని నిర్వహణ గాలికి వదిలేయడంతో మూతపడింది. దీంతో పర్యాటకులు అధిక ధరలు చెల్లించి నీటిని కొనుగోలు చేయాల్సివస్తోంది. వీటిని వినియోగంలోకి తీసుకొస్తే భారం తగ్గుతుందని పర్యాటకులు అంటున్నారు.

టూరిస్ట్ పోలీసు ఎక్కడ?



గత సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో పర్యాటకుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసు విధానం అమల్లోకి తీసుకొచ్చి హార్సిలీహిల్స్‌పై 2023 ఫిబ్రవరి 14న పోలీస్‌స్టేషన్ ప్రారంభించారు. నిత్యం ఆరుగురు పోలీసులు విధుల్లో ఉండేలా టూరిస్ట్ పోలీసింగ్ ఉంటుందని అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. ఇప్పుడు కొండపై పోలీసు భద్రత కనిపించడం లేదు. వారాంతంలో వందలసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. గాలిబండపై పోలీసు సమాచార కేంద్రం నిర్మించినా నిరుపయోగంగా ఉంది.

ఎక్కడిచెత్త అక్కడే



హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 2022లో గత కలెక్టర్ గిరీషా, ఆర్డీఓ, మురళీలు పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా కార్మికులను నియమించారు. వీరు ప్రతిరోజూ కొండపై చెత్త సేకరించి బండిపై తరలించేవారు. కొంతకాలంగా పారిశుద్ధ్య పనులు పూర్తిగా నిలిచిపోయాయి. చెత్త, మద్యం బాటిళ్లు రోడ్లపై దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించే వారు లేక పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు. మందుబాబులు రోడ్లపైనే మద్యం తాగుతూ సందర్శకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గాలిబండ ప్రాంతంలో చెత్త పేరుకపోయింది.

దూసుకొచ్చిన మృత్యువు!

చుట్టూ చీకటి.. ఏమైందో తెలీదు..ఏం జరుగుతోందో అర్థం కాలేదు.. కళ్లు తెరిచి చూసేలోపే ఘోరం జరిగిపోయింది. మృత్యువు రాకాసిలా దూసుకొచ్చి 'పంచ' ప్రాణాలను గాల్లో కలిపేసింది. ఓ కుటుంబలో భర్తను మృత్యు ఒడికి చేర్చి.. భార్యా పిల్లలను రోడ్డు పాలు చేసింది. మరో కుటుంబంలో భార్యను మృత్యు కౌగిట్లోకి పంపి భర్త..పిల్లలను శోక సంద్రంలో ముంచెత్తింది. ఒకటా రెండా.. ఏకంగా ఐదు కుటుంబాల్లో నిండు చీకట్లు నింపి.. వెలుగు దూరం చేసింది. కడప నగర శివార్లలోని 'గువ్వల చెరువు' మరోసారి రక్తమోడింది. ఈసారి ఒకరిద్దరు కాదు ఏకంగా ఐదుగురు మృత్యువాత పడ్డారు. బాధితుల ఆర్తనాదాలు చీకటి మింగేయగా... ప్రమాదాలు జరగని రోజు ఎప్పుడొస్తుందంటూ 'ఘాటు' మౌనంగా చూస్తూ ఉండిపోయింది.



వెంకటమ్మ (ఫైల్) షరీఫ్ (ఫైల్) నాగలక్ష్మి (ఫైల్) నాగయ్య (ఫైల్)

- గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ఐదుగురు
- దువ్వూరు మండలం బయనపల్లి వద్ద ముగ్గురు మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

చక్రాయపేట/కడప అర్బన్/రామాపురం : గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదం చక్రాయపేట మండలంలో తీరని విషాదాన్ని నింపింది. చక్రాయపేట మండలం కుప్పం గ్రామం కె.వడ్డెపల్లెకు చెందిన ముగ్గురు, చక్రాయపేటకు చెందిన కారు డ్రైవరు మృతి చెందారు. వడ్డెపల్లెకు చెందిన సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆయన పెద్ద ఖర్మను ఇంట్లో నిర్వహించారు. అనంతరం మృతుడి భార్య చిన్న వెంకటమ్మ బంధువుల ఇళ్లలో దీపం చూడటానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో వల్లెపు చిన్నవెంకటమ్మ(45)తో పాటు తోడుగా వెళ్లిన ఆమె సోదరుడు గుజ్జుగారి నాగయ్య (40), కోడలు వరుసకు చెందిన వల్లెపు నాగలక్ష్మీదేవి (35)లతో పాటు కారు బాడుగకు వెళ్లిన చక్రాయపేటకు చెందిన మహబూబ్ షరీఫ్ (40), కంటైనర్ డ్రైవర్‌లు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను రాయచోటి ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వడ్డె పల్లె..తల్లడిల్లె..

వడ్డె పల్లెకు చెందిన మృతులు ముగ్గురూ బంధువులే కావడంతో ఆ ఊర్లోనూ విషాదం నెలకొంది. మృతుడు నాగయ్యకు భార్య అంజనమ్మతో పాటు 17 ఏళ్లలోపు ఉన్న ముగ్గురు బిడ్డలు ఉన్నా రు. వల్లెపు నాగలక్ష్మీ దేవికి భర్త ఆంజనేయులుతో పాటు 12 ఏళ్లలోపు ముగ్గురు బిడ్డలు ఉన్నారు.

సంఘటన స్థలానికి పరుగులు

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే కె,వడ్డెపల్లె,చక్రాయపేట వాసులు అద్దె వాహనాల్లో గువ్వల చెరువుకు వెళ్లారు. అక్కడి నుంచి మృత దేహాలు ఉన్న రిమ్స్‌కు వెళ్లారు.

నాల్గో మలుపు వద్ద ప్రమాదం..

కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులోని నాల్గోవ మలుపు వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. కడప నుంచి కారు గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు నాల్గోవ మలుపు వద్దకు రాగానే రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న అమరరాజా బ్యాటరీకి చెందిన లారీ ఢీ కొనడంతో లారీ డ్రైవర్‌తో సహా ఐదుగురు మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి, సీకే దిన్నె ఎస్‌ఐ, సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులను కారులోని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

కుటుంబ పోషణ కోసం కారు పెట్టుకొని..



చిన్న బిడ్డలను పట్టు కొని కన్నీటి రోదనతో ఉన్న డ్రైవర్ సతీమణి షాహీన్

చక్రాయపేటకు చెందిన మహబూబ్ షరీఫ్ తన కారును బాడుగలకు తిప్పుతూ వచ్చిన ఆదాయంతో భార్యా బిడ్డలను పోషించు కొంటున్నాడు. ఇందులో భాగంగానే సోమవారం కారుకు బాడుగ మాట్లాడుకొని భార్యకు జాగ్రత్తలు చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. బాడుగ మాట్లాడుకున్న ప్రకారం.. వడ్డెపల్లె నుంచి వేంపల్లె, అయ్యావారుపల్లె, మైదుకూరు, మిట్టమీదపల్లె, కడపలో ఉన్న బంధువుల ఇళ్లవద్దకు వెళ్లారు. కడప నుంచి గువ్వల చెరువుకు వెళుతుండగా లారీ రూపంలో మృత్యువు కబలించింది. భర్త మహబూబ్ షరీఫ్ మృతి వార్త తెలుసుకున్న భార్య షాహీన్ కన్నీటి పర్యంతమైంది. షరీఫ్‌కు ఐదుగురు సంతానం కాగా.. ఇద్దరు మొదటి భార్య బిడ్డలు. ఆమె చనిపోవడంతో రెండవ వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి ముగ్గురు సంతానం. పిల్లలందరూ పదేళ్లలోపే కావడంతో తమ గతి ఏంటంటూ షాహీన్ కన్నీటి పర్యంతం అవుతోంది.

పుట్టు వెంట్రుకలకు వెళుతుండగా..

- కారు అదుపు తప్పి బోల్తా..
- ముగ్గురు దుర్మరణం
- దువ్వూరు మండలం చింతకుంట వద్ద ఘటన



మృతి చెందిన చిన్నారి కియాన్‌సింగ్, చిన్నారి తండ్రి భగత్‌సింగ్, వృద్ధురాలు నాగలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం/ దువ్వూరు : కుమార్తె పుట్ట వెంట్రుకల కార్యక్రమాన్ని తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించాలని తల్లిదండ్రులు మొక్కున్నారు. ముఖ్యమైన బంధువులతో కలిసి సంతోషంగా రెండు కార్లలో బయలుదేరారు. అయితే మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదం చిన్నారితో సహా మరో ఇద్దరిని బలి తీసుకుంది. మొక్కు తీర్చుకునే అవకాశం ఇవ్వకుండానే చిన్నారిని దేవుడు తిరిగి రాని లోకాలకు తీసుకెళ్లాడు. దువ్వూరు మండలంలోని చింతకుంట గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో కర్నూలుకు చెందిన కియాన్‌సింగ్ (9 నెలలు), భగత్‌సింగ్ (34), నాగలక్ష్మి (70) దుర్మరణం చెందారు.

ఫోన్ చేసేంత వరకు వారికి తెలియదు..

చెర్లోవెట్ 7 సీటర్ కారు, తుఫాన్ వాహనాల్లో వారు తిరుమలకు పయనమయ్యారు. ముందుగా తుఫాన్ వాహనం వెళ్తుండగా కొంత దూరంలో వారి వెనకాలే చెర్లోవెట్ కారును భగత్‌సింగ్ డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. అయితే కారు బోల్తా పడిన విషయం ముందుగా తుఫాన్‌లో వెళ్తున్న వారికి తెలియదు. ప్రమాదానికి గురైన వారు తేరుకొని కొంత సేపటి తర్వాత ఈ విషయాన్ని వారికి తెలిపారు. అప్పటికే చాలా దూరం వెళ్లిన బంధువులు తుఫాన్ వాహనాన్ని వెనక్కి తిప్పుకొని వచ్చారు. స్థానికుల సాయంతో గాయ పడిన వారిని 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు.

ఐదు నిమషాల ముందు చిన్నారి తండ్రి వద్దకు వెళ్లింది

చిన్నారి కియాన్‌సింగ్ తన బాబాయి వద్ద మధ్య సీట్లో కూర్చుంది. తండ్రి వద్దకు వెళ్తానని ఏడ్వడంతో కియాన్‌సింగ్‌ను డ్రైవింగ్ చేస్తున్న తండ్రి భగత్‌సింగ్ వద్దకు పంపించారు. డ్రైవింగ్ చేస్తున్న భగత్‌సింగ్ పాపను తన ఒళ్లోనే కూర్చోపెట్టుకున్నాడు. ఐదు నిమిషాల తర్వాత కారు ప్రమాదానికి గురైంది. తండ్రి వద్దకు పాప వెళ్లకుండా ఉండి ఉంటే బతికేదని చెప్పుకుంటూ బంధువులు విలపించసాగారు. కాగా జిల్లా ఆస్పత్రిలో బంధువులు రోధనలు చూసేవారికి కంటతడి తెప్పిస్తున్నాయి. దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

రాయచోటి అర్బన్ : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని తీజ్‌ఉత్సవ కమిటీ సభ్యులు బుక్కే విశ్వనాథనాయక్, రామదాసునాయక్, శంకర్‌నాయక్‌లు తెలిపారు. రాయచోటి పట్టణంలో సోమవారం తీజ్‌ఉత్సవాలు నిర్వహించారు. ఎస్ఎన్ కాలనీలోని సాయిబాబు గుడి నుంచి బంగ్లా సర్కిల్ వరకు శోభాయాత్ర జరిపారు. అనంతరం గిరిజన నృత్యాలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీనేతలు మాట్లాడుతూ బంజారాలు చేసుకునే పండుగల్లో అతి ముఖ్యమైనది ‹తీజ్› అని అన్నారు.పెళ్లికాని ఆడపడుచుల కలల పండుగగా కూడా దీనిని పరిగణిస్తారన్నారు. పండుగను 9 రోజులపాటు నిర్వహిస్తారన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని బంజారా ఆడపిల్లలు తీజ్‌బుట్టల్లో గోధుమ విత్తనాలు చల్లి నీరు పోసి.. నారును పెంచి తర్వాత నీటిలో కలిపేస్తారన్నారు. కార్యక్రమంలో బంజారా నేతలు మదన్‌మోహన్, రామానుజన్ నాయక్, అన్నయ్య నాయక్, బిల్లునాయక్, నారాయణ నాయక్ వినోద్‌నాయక్, తిరుపాల్ నాయక్, రామాంజులు నాయక్, రఘునాథనాయక్, చక్రేనాయక్, శ్రీనివాసులు నాయక్, నాగముని తదితరులు పాల్గొన్నారు.

నేడు హంద్రీ-నీవాపై సమీక్ష

బి.కొత్తకోట : అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో సాగే హంద్రీ-నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ, కుప్పం ఉపకాలువపై మంగళవారం చిత్తూరులో కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ కాలువలకు సంబంధించి పెండింగ్‌లోని భూ సేకరణ, ఇతర పనులపై సమీక్షించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రాజెక్టు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరవుతున్నారు.

నేత్ర దానం ఎంతో గొప్పది

ఓబులవారిపల్లె : అన్ని దానాల కంటే నేత్రదానం గొప్పదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ముక్కవారిపల్లెలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను, జిల్లా వైద్యాధికారి కొండయ్య, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి కొండయ్య మాట్లాడుతూ ఈనెల 25 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్ర దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి వెలుగును ప్రసాదించిన వారవుతారన్నారు.

3,11,000 పలికిన కల్యాణం లడ్డూ

నందలూరు : నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరం వద్ద సోమవారం ఉదయం శ్రీకృష్ణుని కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట జరిగింది. నీలి పల్లి గ్రామానికి చెందిన ఉప్పు శెట్టి విజయమ్మ రూ. 3,11,000లకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



వైద్యుల ప్రాణాలు తీసేవారిని కఠినంగా శిక్షించాలి



డాక్టర్లు దేవుళ్లతో సమానం. వైద్యులపై దాడి హేయమైన చర్య. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి వారిపై దాడులు చేయడం శోచనీయం. ప్రభుత్వాలు వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యురాలిపై దాడి చేయడం చాలా బాధాకరం. వెంటనే దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

- డాక్టర్ సానే శేఖర్, పుల్లంపేట

చట్టాలు అవసరం



మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్స్, నర్సులకు తక్షణ భద్రత అవసరం. కఠినమైన చట్టాలు తీసుకురావాలి. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో ఈ చట్టాలు వస్తాయని ఆశిస్తున్నాం. కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన ఘాతుకం ఇక పునరావృతం కాకూడదు. సెక్యూరిటీ స్టాఫ్‌ను ఏర్పాటు చేయాలి.

-శశిరేఖ, స్టాప్‌నర్స్, ఏరియా హాస్పిటల్, రాజంపేట

ప్రాణాలను కాపాడే తెల్లకోటుకు రక్తపు మరకలా



కలకత్తా ఘటన మాయని మచ్చ. దేశ వ్యాప్తంగా ప్రభావం చూపింది. ప్రాణాలను కాపాడే తెల్లకోటుకు కామాంధులు రక్తపు మరకలు అంటించారు. ఇలాంటి మృగాళ్లకు పట్టిన మదాన్ని వదిలించాలి. ఏ తప్పుచేయని డాక్టర్‌ను బలి తీసుకున్నారు. ఇలాంటి దుర్మార్గులను ఊరికే వదల కూడదు. ఉరి తీయాలి. దారుణాలకు పాల్పడేవారికి గుణపాఠం కలగాలి. డాక్టర్‌కు ఆత్మ శాంతి కలగాలంటే వెంటనే న్యాయం జరగాలి. వారి కుటుంబాన్ని ఆదుకోవాలి.

-శ్రీదేవి, స్టాఫ్ నర్సు, కురబలకోట ప్రభుత్వ ఆసుపత్రి

రాత్రి వేళల్లో విధులు సవాలే




ప్రస్తుతం వైద్యులపై దాడులు, మహిళా డాక్టర్లపై అత్యాచారాలు జరగడం ఆందోళనకరం. రాత్రి వేళల్లో విధులు నిర్వహించడం సవాలుగా మారింది. ఆసుపత్రులలో మహిళా డాక్టర్లతో పాటు నర్సులు, జీఎస్ఎంలు, సీహెచ్ఓలు విధులు నిర్వహిస్తుంటారు. వారికి తప్పని సరిగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. ఎందుకంటే వైద్యం చేయాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే. ఓ డాక్టర్ ఎంతో మంది ప్రాణాలు కాపాడతాడనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి.

- మధుసూదన్‌రెడ్డి, వైద్యుడు, సంబేపల్లి పీహెచ్‌సీసిద్ధవటం మండలం

క్లుప్తంగా

ఘనంగా సిద్దేశ్వరస్వామి ఊరేగింపు



తాళ్లపాకలో ఊరేగుతున్న శ్రీ సిద్దేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు

రాజంపేట : తాళ్లపాకలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో సోమవారం రాత్రి శ్రీ సిద్దేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీ సిద్దేశ్వరాలయం పవిత్రోత్సవాలలో భాగంగా స్వామివార్ల ఊరేగింపును తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. పురవీధుల్లో స్వామివార్లకు భక్తులు కాయకర్పూరం సమర్పించుకున్నారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సర్పంచ్ గౌరీశంకర్, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై మంటలు

రాజంపేట రూరల్ : పట్టణంలోని అన్నపూర్ణ హోటల్ గోడౌన్‌లో సోమవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది యజమాని మురళీ దృష్టికి తీసుకురావడంతో ఆయన అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఫైర్ అధికారి సుభాన్ తన సిబ్బందితో వెళ్లి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పిపోయింది.

రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఫారెస్టు అధికారుల అదుపులో నిందితులు, దుంగలు

సుండుపల్లె : రాయవరం సెక్షన్ బీటులోని జింకల బండ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఏపీ03బీకే5520 యమహా వాహనంలో రెండు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. నిందితులు సంబేపల్లి మండలం, గోరవాండ్లపల్లెకు చెందిన కె.శివాజీ, బి.రవితేజలుగా గుర్తించామన్నారు. రెండు ఎర్రచందనం దుంగలు 24 కిలోలు ఉండగా వీటి విలువ రూ. 28 వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రమేష్ బాబు, ప్రసన్న, స్వాతి, వైసీ రెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పులివెందుల రూరల్ : నగరిగుట్ట, కదిరిరోడ్డులో పేకాట స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ సీఐ ఆదేశాల మేరకు పట్టణంలోని రెండు ప్రాంతాల్లో దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని నగరిగుట్టలో రూ.23,180లు, కదిరిరోడ్డులో రూ.12,730లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దయచేసి రండి.. రైల్వే సమస్యలు చర్చిద్దాం.!

- ఎంపీలకు దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్ పిలుపు
- అక్టోబర్ 4న విజయవాడలో ఎంపీలతో రైల్వే మీట్



రాజంపేట : చాల కాలం తర్వాత ఎంపీలతో సమావేశం కావాలన్న ఆలోచనకు దక్షిణమధ్యరైల్వే వచ్చింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న విజయవాడలో రాష్ట్రంలోని పలువురు పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులను తాము నిర్వహించబోయే సమావేశానికి రావాలని దక్షిణ మధ్య రైల్వే లేఖలు పంపింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్ పేరిట లేఖలు ఎంపీల కార్యాలయాలకు అందాయి. సమావేశంలో మీ ప్రాంత రైల్వే సమస్యలు తీసుకురండి, చర్చిద్దాము, పరిష్కరిస్తామంటూ అందులో పేర్కొన్నారు. వివిధ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, పలు రైళ్ల స్టాపింగ్, కొత్తరైళ్లు, కొత్త రైలుమార్గాల గురించి ఎంపీలు కేవలం లోక్‌సభలో ప్రస్తావించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవేళ ఎంపీలు ఏదైనా అంశాన్ని తీసుకొచ్చినా, దానికి సవాలక్ష సాంకేతిక కారణాలు చెప్పి కాదనే సమాధానం ఇవ్వడం దక్షిణ మధ్య రైల్వేకి మామూలైంది.

పట్టాలెక్కని ఎంపీల ప్రతిపాదనలు..

తమ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో ఎంపీలు తమ ప్రాంత రైల్వే అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు రైల్వేమంత్రినో, రైల్వేబోర్డు చైర్మన్‌నో కలిసి వినతిపత్రాల రూపంలో సమర్పిస్తున్నారు. ఎన్‌డీఏ పాలనలో ఎంపీలకు రైల్వేపరంగా ప్రాధాన్యత కల్పించడంలేదన్న అపవాదును మూటకట్టుకుంది. ఎంపీలు కీలకమని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇప్పటి వరకు గుర్తించినట్లు లేదన్న విమర్శలు ఎంపీల నుంచే వినబడుతున్నాయి. జోన్, డివిజన్ స్థాయి ఉన్నతాధికారులే ప్రతిపాదనలు చేసుకోవడం, అభివృద్ధిపై నిర్ణయాలు చేసుకుంటున్నట్లు ఎంపీ వర్గాల్లో అసంతృప్తి నెలకొంది.

రైళ్ల స్టాపింగ్ పెద్ద సమస్య..

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రధానంగా రైలు ప్రయాణికులు పలు రైల్వేసేషన్లలో ఎదుర్కొంటున్న రైళ్ల స్టాపింగ్ సమస్య తీరేటట్లు ఉంది.
- తిరుపతి-నిజాముద్దీన్ మధ్య నడిచే రైలు ఓబులవారిపల్లె, నందలూరు, కమలాపురం, కొండాపురం స్టేషన్లలో ఆగడం లేదు.
- కాచిగూడ-తిరుపతి (వెంకటాద్రి) 12797/98 నంబరుతో నడిచే రైలు కొండాపురం, నందలూరు, ఓబులవారిపల్లెలో ఆగడం లేదు.
- ముంబయి-చెన్నై మధ్య నడిచే (22157/22158) రైలుకు కొండాపురం, నందలూరు, కమలాపురంలో స్టాపింగ్ లేదు.
- ముంబయి-చెన్నై మధ్య నడిచే (22159/22160) ఎక్స్‌ప్రెస్ రైలు నందలూరు, కమలాపురం, ముద్దనూరులో ఆగడం లేదు.
- తిరుపతి-కొల్హాపూర్ మధ్య నడిచే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు నందలూరు, ముద్దనూరు, కొండాపురం, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరులో ఆగడం లేదు.
- వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో ఒకరోజు రాజంపేట, నందలూరులో ఆగడం లేదు.
- తిరుపతి-ఔరంగాబాద్ మధ్య నడిచే రైలుకు నందలూరు, రాజంపేటలో స్టాపింగ్ తీసేశారు.
- కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైలుమార్గాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి. డెమో, మెమో లేదా ఇంటర్ సిటీ రైలు తరహాలో కొత్తరైలును నడిపించాలనే డిమాండ్ ఉంది. ఫలితంగా కర్నూలు, కడప, నెల్లూరు కనెక్టివిటీ కలుగుతుంది.

నందలూరులో పలురైళ్లకు వాటరింగ్ ఏర్పాటు డిమాండ్..

ముంబయి-చెన్నై రైలు మార్గంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న నందలూరు రైల్వేకేంద్రంలో పలు రైళ్లకు వాటరింగ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. మరీ ఈ డిమాండ్‌ను ఎంపీలు దక్షిణ మధ్య రైల్వే దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. నీటివనరులు పుష్కలంగా ఉండటం వల్లనే బ్రిటీషర్లు ఇక్కడ లోకోషెడ్ పెట్టారన్న అంశాన్ని రైల్వేశాఖ పరిగణనలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎంపీల వినతులను సకాలంలో అమలు చేయాలి



ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ తమ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రజల కోసం ఎంపీలు చేసే ప్రతిపాదనలు, డిమాండ్స్, కోరిన స్టాపింగ్స్ అమలు చేయాల్సిన బాధ్యత దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులపై ఉంది. ఏవో కారణాలు చూపి పక్కకు నెట్టేసే విధానం రైల్వేలో కొనసాగుతోంది. జిల్లాలో ప్రయాణికులు ప్రధానంగా రైళ్ల స్టాపింగ్ లేక ఇబ్బందులు పడుతున్నారు.

-తల్లెం భరత్‌రెడ్డి, మాజీ సభ్యుడు, డీఆర్‌యూసీసీ, రైల్వేకోడూరు

రైల్వేపరంగా ఎంపీలకు ప్రాధాన్యత ఏదీ!



దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే పరంగా ఎంపీలకు ప్రాధాన్యత ఏదీ అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా ఉంది. లోక్‌సభలో మాట్లాడాలి.. లేకుంటే ఎంఆర్‌కు, రైల్వేబోర్డుకు వినతులివ్వాలి. కానీ ఉన్నతాధికారులు అనుకున్నదే తడవుగా ఏదైనా సరే వెనువెంటనే అమలు చేసుకుంటారు. ఎంపీల వినతులను పట్టించుకోక పోవడం దారుణం.

-షేక్ మహమ్మద్‌అలీ, మాజీ ఏజీపీ, నందలూరు

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం, అనంతరాజుపేట పంచాయతీ, గుండాలేరు బ్రిడ్జి వద్ద ట్రాక్టర్, బైకు ఢీ కొన్న సంఘటనలో వెంకటలక్ష్మి (18) అనే యువతి మృతి చెందింది. వివరాలిలా.. వెంకటలక్ష్మి, శకుంతల, చెంచయ్య అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రాజంపేటవైపు వెళ్తుండగా కోడూరు వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. దీంతో వాహనంలో ఉన్న వెంకటలక్ష్మి మృతి చెందింది. మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



అర్షద్ (ఫైల్)

బి.కొత్తకోట : ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు గౌడ్ తెలిపారు. స్థానిక వాయలవంకకు చెందిన పట్నూల్ అర్షద్‌ఖాన్ (17) స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈనెల 24న కళాశాలకు వెళ్లిన అర్షద్ మధ్యాహ్నం 3 గంటలకు కళాశాలలో లేడని సమాచారం అందడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు పోలీస్, సీఐడీ అధికారులు



సబ్ కలెక్టరేట్‌లో సీఐడీ విచారణకు వీఆర్‌ఏ రమణయ్యను తీసుకువచ్చిన పోలీసులు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనపై విచారణకు సోమవారం రాత్రి పోలీస్, సీఐడీ అధికారులు సబ్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అన్నమయ్యజిల్లా అడిషనల్ ఎస్పీ, ఐఓ రాజ్‌కమల్, సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు సాయంత్రం 6.30 గంటలకు సబ్ కలెక్టరేట్‌లో ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టరేట్ ఫైల్స్ దగ్ధం కేసు విచారణ సీఐడీకి అప్పగించిన నేపథ్యంలో సోమవారం రాత్రి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మరోసారి మదనపల్లెకు కేసు విచారణలో భాగంగా వస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఘటనకు ప్రత్యక్ష సాక్షులైన వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, ఆర్డీఓ హరిప్రసాద్, పూర్వ ఆర్డీఓ ఎం.ఎస్.మురళీలను విచారించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మరోసారి పోలీసు జాగిలాలతో ఆధారాల కోసం పరిశీలించడంతో పాటుగా దర్యాప్తును వీడియో రికార్డింగ్ చేయించారు. జూలై 21 ఆదివారం రాత్రి అగ్నిప్రమాద ఘటన జరిగిన తర్వాత...ఫైళ్ల దహనంపై ఆర్డీఓ హరిప్రసాద్ ఫిర్యాదుమేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన 135/2024 కేసుకు అనుసంధానంగా 8 కేసులు నమోదుచేశారు. క్లూస్‌టీం, నాగపూర్ నుంచి నేషనల్ ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్డీఓలతో పాటుగా 32 మందిని వేర్వేరుగా ప్రశ్నించారు. 15 మంది అనుమానితులను విచారించారు. ఈ ఘటనపై రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా మాట్లాడుతూ..ఘటనలో నాగపూర్ ఫోరెన్సిక్‌రిపోర్ట్ వచ్చిన తర్వాతే నిందితుల అరెస్ట్ ఉంటుందని తెలిపారు. అయితే ఘటన జరిగిన 35 రోజుల తర్వాత తిరిగి సబ్ కలెక్టరేట్‌ను పోలీసులు ఆధీనంలోకి తీసుకుని, మరోసారి విచారణ చేపట్టడం చర్చనీయాంశమైంది.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు (55)

నిమ్మనపల్లె : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నిమ్మనపల్లె పంచాయతీ దేవళం కురవపల్లెకు చెందిన దేవరింటి శ్రీనివాసులు (55) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం అగ్రహారం సమీపంలో కూలి పనులు ముగించుకొని, రాత్రి నడుచుకుంటూ స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలో నిమ్మనపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన చలపతి కుమారుడు గాలేటి ఆదర్శ్ (18) ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ద్విచక్ర వాహనంలోని యువకుడు ఆదర్శ్ సైతం గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి కేసు విచారణ చేస్తున్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- అధికారపార్టీ ముసుగులో ఇసుక, మట్టి దోపిడీ
- మెయిన్‌రోడ్డు మీదుగానే టిప్పర్ల రాకపోకలు
- పట్టించుకోని అధికారులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుతో టిప్పర్ సీజ్



అక్రమ గ్రావెల్ తవ్వకాలతో రూపురేఖలు కోల్పోతున్న అంకిశెట్టిపల్లె బుద్ధునికొండ


మదనపల్లె : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శని,ఆది, ప్రభుత్వ సెలవుదినాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగేది. ఇప్పుడు పట్టపగలే అధికార పార్టీ అండదండలతో తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలోని అంకిశెట్టిపల్లె బుద్ధునికొండను కొంతకాలంగా గ్రావెల్ ట్రాన్స్‌పోర్టర్స్ అడ్డాగా మార్చుకున్నారు. అంకిశెట్టిపల్లె నుంచి తుమ్మలతాండాకు వెళ్లేదారిలో బుద్ధునికొండను సగానికి పైగా తొలిచేశారు. ఏకంగా ఈ కొండను నమ్ముకుని దాదాపు 10 టిప్పర్లు, మూడు జేసీబీలు, రెండు హిటాచీలు అక్కడే తిష్ట వేశాయంటే గ్రావెల్ తవ్వకాలు ఏ స్థాయిలో జరిగాయో ఊహించుకోవచ్చు. సోమవారం ఉదయం బుద్ధునికొండలో గ్రావెల్ తవ్వకాలను మొదలుపెట్టి...చిప్పిలి అమూల్ డెయిరీ పక్కన వేస్తున్న ఓ ప్రైవేట్ వెంచర్‌లోని చదును పనులకు తరలించారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. తమకు ఏమీ తెలియనట్లుగానే వ్యవహరించారు. వారంరోజులుగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అధికారపార్టీ ఇసుక మాఫియా, గ్రావెల్ తవ్వకాలపై అక్రమాలను వెలుగులోకి తెస్తూనే ఉన్నారు. సోమవారం ఉదయం గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో నేరుగా జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో అప్పటికప్పుడు అంకిశెట్టిపల్లె వీఆర్వో చంద్రమోహన్ సంఘటనాస్థలానికి చేరుకుని టిప్పర్‌ను సీజ్‌చేసి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..కొందరు గ్రావెల్, ఇసుకను తరలించే టిప్పర్ యజమానులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో సన్నిహితంగా ఉండటం మొదలుపెట్టారు. తాము ఎమ్మెల్యే అనుచరులమని ప్రచారం చేసుకోవడమే కాకుండా, ఆయనను కలిసేందుకు వచ్చే పోలీసు, రెవెన్యూ అధికారులను సైతం మచ్చిక చేసుకున్నారు. యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక అక్రమతవ్వకాలను మొదలుపెట్టారు. సోమవారం చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుపై వెళుతున్న టిప్పర్‌ను మొదట తాలూకా సీఐ పట్టుకున్నారు. అయితే ఆయనకు ఫోన్ రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత సీపీఎం శ్రీనివాసులు వెళ్లి వాహనాన్ని నిలిపితే... ఇప్పుడే సీఐ వచ్చి వాహనాన్ని చెక్ చేసి పంపేశారని డ్రైవర్ చెప్పాడు. గ్రావెల్ తరలింపున పత్రాలు అడిగితే చూపకపోగా, అక్కడ నుంచి పరారయ్యాడు. పట్టపగలే యథేచ్ఛగా అధికార పార్టీ ముసుగులో జరుగుతున్న గ్రావెల్ రవాణాపై, అధికారులు ఉదాసీనత కనపరచడంపై పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చనికొండలు కళావిహీనంగా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులతో సత్సంబంధాలు

గ్రావెల్, ఇసుక మాఫియాకు అధికారులతో సత్సంబంధాలు ఉన్నందునే ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు తరలింపు ఆగడం లేదు. బార్లపల్లె ఇసుక డంప్‌ను సీజ్‌చేశారే కానీ, దాని వెనుక ఎవరు ఉన్నారనే విషయం తేల్చలేకపోయారు. ఇసుక, మట్టి అక్రమతరలింపులకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకుని పోరాటం చేస్తాం.

– పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పాత పెన్షన్ పునరుద్ధరణే పరిష్కారం



సీపీఎస్ కన్వీనర్ సీవీ రమణ

పుల్లంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) ఆమోదయోగ్యం కాదని, దానిని అంగీకరించే ప్రశ్నే లేదని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా సీపీఎస్ కన్వీనర్ సీవీ రమణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేకుండా సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే తమకు ఆమోదయోగ్యమని వారన్నారు. పాత పెన్షన్ అమలయ్యేంతవరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు.

ఆటో ఢీకొని గాయపడిన కార్మికుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

మదనపల్లె : ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన కార్మికుడు తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కె.రామచంద్ర తెలిపారు. కడప చిన్నచౌక్ అశోక్‌నగర్‌కు చెందిన దేవపట్ల శ్రీనివాసులు(52), భార్య ఇందిర, తల్లి సరస్వతితో కలిసి నెలరోజుల క్రితం మదనపల్లెకు వచ్చి చంద్రాకాలనీలో ఉంటున్నారు. ముగ్గురూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈనెల 21వతేదీన బుధవారం రాత్రి శ్రీనివాసులు ఇంట్లో నుంచి బయటకు వచ్చి బైపాస్‌రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన ఆటో శ్రీనివాసులును ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులును స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు విచారణ చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

సుండుపల్లె : రాచంవాండ్లపల్లెకు చెందిన ఇరు వర్గాలు దాడి చేసుకోవడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాత్రి రాచంవాండ్లపల్లెకు చెందిన చెలువ శ్రీరాములు కుటుంబీకులు, హరికృష్ణ వర్గీయులు భూ తగాదా విషయంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. శ్రీరాములు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై, హరికృష్ణ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పెద్దమండ్యం : ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అతని కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్యాంప్రకాష్ సోమవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్ఓ పల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరుకు చెందిన సయ్యద్ అయిషాబానుకు వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన రహమత్‌బాషాతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారి సంసారం కొన్నిరోజుల పాటు సజావుగా సాగినా భర్త అదనపు కట్నం కోసం వేధించేవాడు. గతంలో ఇలా వేధిస్తుంటే పోలీస్ స్టేషన్‌లో భర్తతో పాటు కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది. కోర్టులో రాజీ చేసుకొని సంసారానికి తీసుకెళ్లారు. తిరిగి భర్త, కుటుంబ సభ్యులు వరకట్న వేధింపులు మొదలుపెట్టారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నేత్రదానంపై అవగాహన అవసరం



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

రాయచోటి అర్బన్ : నేత్రదానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులపై ఉందని డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్య శాలలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నాలను వైద్యసిబ్బంది చేయాలన్నారు. అనంతరం నేత్రదానం చేద్దాం - అంధులకు కంటిచూపును ప్రసాదిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కోటేశ్వరమ్మ, సౌజన్య, భాస్కర్‌రెడ్డి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే రోజు 18 మందిపై కుక్కల దాడి



కుక్క కాటుకు గురైన బాధితులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలంలో సోమవారం కుక్కలు 18 మందిపై దాడి చేసి గాయపరిచాయి. టౌన్ పరిధిలోని విశ్వ భారతి హైస్కూల్, బాలయోగి గురుకుల పాఠశాల, బస్టాండ్, దర్గా, మిస్సా చర్చి, పాత కోర్టు ప్రాంతాలలో రోడ్డుపై ఉన్న వ్యక్తులనే కాకుండా ద్విచక్ర వాహనాలలో వెళ్తున్న వారిని సైతం వదలకుండా కుక్కలు మీదపడి గాయపరుస్తున్నాయని టౌన్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. లక్కిరెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, యోగేశ్వర్, అన్వర్ బాషా, మౌలాన్, బి.రామచంద్ర, శివ, బాబ్జీ, బాబు, రజాక్, జాబీర్ బాషా, శ్రీనివాసులు, వెంకటరమణ, మస్తాన్ వలీ, అబ్దుల్ ఆలంను కుక్కలు గాయపరిచాయి.